క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

కొల్లాపూర్/కల్వకుర్తి టౌన్: ఆర్టీసీ రవాణా అంశాలపై సమస్యలు, సలహాలు తెలియజేసేందుకు గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ఉమా శంకర్ వెల్లడించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రయాణికులు సెల్ నం 9000405878కు ఫోన్ చేయాలని సూచించారు. కల్వకుర్తి డిపో పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సెల్: 9959226292 నంబర్‌ను సంప్రదించి సమస్యలను తెలపాలని డీఎం సుభాషిణి తెలిపారు.

విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

బల్మూర్: మండలంలోని చెన్నారంలో పెద్దమ్మ గుడికి విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో యాదవులు ఎమ్మెల్యే వంశీకృష్ణకు బుధవారం విన్నవించారు. దీంతో ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశించారు. గుడికి విద్యుత్ సరఫరాకు కావల్సిన స్తంభాలు, తీగలను ఏర్పాటు చేయించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం



కల్వకుర్తి టౌన్/రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆమనగల్ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 48 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 34 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ శిబిరాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భీమా నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్ బావన్ల వెంకటేష్, సీహెచ్‌ఓ శ్రీనివాస్, డాక్య, సుదర్శన్‌రెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు నోటీసుల జారీ

కోడేరు: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో డబ్బాలు వేసుకొని వ్యాపారాలు చేసుకుంటున్న వారికి గ్రామ పంచాయతీ సిబ్బంది 38 మందికి నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రవితేజ, కారోబార్ సాయిబాబులు తెలిపారు. 2023 జనవరి నుంచి దాదాపు 13 నెలల కావొస్తున్నా ఏ ఒక్కరు కూడా గ్రామ పంచాయతీకి ఎలాంటి రుసుము చెల్లించలేదని వివరించారు. దీంతో నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల గ్రామానికి చెందిన వీరయ్య ప్రమాదవశాత్తు ఇటీవల మరణించారు. మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3వేలు జాగృతి విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు గణేష్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరుశరాములు, రా జేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన బోగరాజు శ్రీను రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబానికి బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బాలస్వామి రూ.5వేలు, కొట్ర సేవా సమితి ఆధ్వర్యంలో రూ.5వేలు బాధిత అందజేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

నాగర్‌కర్నూల్ క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు గ్రామానికి చెందిన ఓ ప్రేమజంట రక్షణ కల్పించాలని బుధవారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వేర్వేరు కులాలకు చెందిన ప్రేమికులు పెళ్లి చేసుకొన్నారు. దీంతో ఆయా కుటుంబాల నుంచి ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించాలని కోరారు. దీంతో పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వేణుగోపాల్ దారం కండెలతో అయోధ్య రామ్‌లల్లా భవ్యమందిర నిర్మాణాన్ని మూడు రోజుల నుంచి అపురూపంగా తీర్చిదిద్దారు. విషయం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు హిందూ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయుడిని సన్మానించారు. ఆయనకు సహకరించిన విద్యార్థులు శశికుమార్, పవన్‌లను అభినందించారు. అనంతరం వారికి శాలువాతో సత్కరించారు. ఉమాపతి ఆచార్యులు, ఎర్రగిన్నెల రవికుమార్, రామకృష్ణ, కనుకు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

కందనూలు: ఫేక్ ఏజెన్సీలను సృష్టించి నాగర్‌కర్నూల్ ఎస్సీ కార్పొరేషన్ నిధులను సొంత అకౌంట్‌లోకి మళ్లించి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశంలో కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి సస్పెండ్ చేశారు. నిధుల మళ్లింపుపై ఇద్దరు ఉద్యోగస్తులపై పోలీస్ కేసు నమోదు చేసి, వారికి సంబంధించిన అకౌంట్లను సీజ్ చేశామని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామ్‌లాల్ తెలిపారు. ఇద్దరు ఉద్యోగులపై విచారణ అధికారిని నియమించామని, నిధులను రికవరీ చేయనున్నట్లు వివరించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



బిజినేపల్లి మండలంల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో



కల్వకుర్తిలో విద్యార్థినిలకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్

కల్వకుర్తి: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఎంఐఎం ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా విద్యపై ఇంకా కొన్ని చోట్ల వివక్ష కొనసాగడం దారుణమన్నారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలతో కలిసి వేడుకలలో పాల్గొన్నారు. పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పుస్తకాలను ఆయన అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, జీహెచ్‌ఎం సీ మల్లేపల్లి కార్పొరేటర్ జాఫర్ ఖాన్, ఉమ్మడి జిల్లా ఎంఐఎం జబేర్ బిన్, కల్వకుర్తి ఇన్‌చార్జ్ సత్తార్, కల్వకుర్తి ఎంఐఎం పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

కల్వకుర్తిరూరల్: బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సబ్‌రిజిస్ట్రార్ సుశీల అన్నారు. బుధవారం పట్టణంలోని సావిత్రీబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజేందర్, ప్రవళిక, అహ్మద్, నవీన్, మునీర్, సిద్ధార్థరాజు, తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో పలు పాఠశాలల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల ఆశ్రమ పాఠశాల, మినీ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు నృత్యాలు చేసి అలరించారు.

బిజినేపల్లి: బాలికలు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పాలెం కేవీకే ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేస్తా



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

వంగూరు: మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ భీమమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంవాసి కావడంతో నియోజవర్గం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్రతిపాదనలు పంపించామన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఇతర భవనాలలో అదనపు గదుల నిర్మాణం, ప్రహరీ నిర్మాణానికి అవసరమైనన్ని నిధులు విడుదల చేయిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే సర్వసభ్య సమావేశంలో ఎలాంటి సమస్యలపై చర్చలు కొనసాగలేదు. సర్పంచుల పదవీకాలం ముగుస్తుండడంతో వారిని ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, జెడ్పీటీసీ సభ్యులు కేవీఎస్ రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్యారాణి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఏఓ తనూజారాజు, ఎంఈఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు బాగా చదవాలి

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను ఎదురించాలని ఆయన అన్నారు. కేజీబీవీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, రింగ్‌బాల్, స్కిప్పింగ్, కుర్చీలాట, రన్నింగ్, క్యారమ్‌బోర్డు, క్రికెట్, చెంచాగోలి పోటీల్లో ఏర్పాటు చేశారు. పిరమిడ్ ఆకారాలను, జాతీయ నాయకుల వేషధారణలు, పాటలను విద్యార్థులు రిహార్సల్ చేశారు.

అవినీతిపై విచారణ చేయించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై విచారణ చేయించాలని బుధవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. బోగస్ ఏజెన్సీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సొమ్మును కాజేసిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. 136 మంది లబ్దిదారులకు సబ్సిడీ పథకాన్ని గ్రౌండింగ్ చేసి దొంగ ఏజెన్సీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సొమ్ము గండి కొట్టారని వివరించారు. అధికారుల నుంచి సొమ్మును రికవరీ చేయాలని కోరారు. ఈ పథకంలో మోసపోయిన దళిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, కాశన్న, అశోక్, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి

కల్వకుర్తి: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల సమస్యలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ వినతిపత్రం అందజేశారు. బుధవారం సెక్రటేరియట్‌లో మంత్రిని యూత్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. పట్టణంలోని సీహెచ్‌సీలో ఉన్న వైద్యులు చాలారోజులుగా ఇక్కడే దీర్ఘకాలికంగా ఉన్నారని వివరించారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దళపతి, రాజశేఖర్, జంగయ్య, ఇమ్రాన్, శివప్రసాద్‌లు ఉన్నారు.

గ్రామరక్షణ దళంతో చోరీలు అరికట్టాలి

వెల్దండ: గ్రామ రక్షణ దళాలతో చోరీలను అరికట్టవచ్చని ఏఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి గ్రామస్తులకు చోరీ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నైట్‌వాచ్‌లో తిరుగుతున్న పోలీస్ సిబ్బందికి యువకులు సహకరించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం ఉంటే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

గెలుపోటములు సహజం



పెద్దకొత్తపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. వార్డు సభ్యులు ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన



తాడూరు: మండలంలోని తుమ్మలసూరులో వివిధ రకాల పంటల సాగుపై కేవీకే పాలెం రావేఫ్ విద్యార్థులు బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రాథమిక పాఠశాల ఆవరణలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాల బాలికలకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజీవన్‌రెడ్డి, రాజేందర్, ప్రమోదర్‌కుమార్‌లతో పాటు రావేఫ్ విద్యార్థినులు నికితారెడ్డి, శ్రావణి, వర్ష, శ్రీశిత, శ్రేయ, సుష్మిత, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ..

మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సైబర్‌నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, విష్ణు, బాలకిష్టయ్య, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

వెల్దండ: మండలంలోని గుండాల అంబ రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు. ఆలయ చైర్మన్‌తో పాటు 8 మంది డైరెక్టర్లను నియమిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు మహబూబ్‌నగర్ దేవాలయ కమిషన్ కార్యాలయంలో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు నామినేషన్ దాఖలు చేయాలని కోరారు.

మల్లురవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కల్వకుర్తి: ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మల్లురవి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసాలలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో పాటుగా, వెల్దండ సర్పంచ్ భూపతిరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సంజీవ్‌యాదవ్, జంగయ్య యాదవ్, ఉన్నారు.

మహిళపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని అనంతవరంలో పాత కక్షలతో దాయాదులు మహిళపై దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గూడెలి అలివేల వ్యవసాయం పొలంలో పశువులను మేపుతోంది. ఆమె దాయాదులు సత్యనారాయణ, అతని భార్య కలమ్మ, కుమారుడు జగదీష్‌లు అకారణంగా మహిళపై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

29న సర్వసభ్య సమావేశం

బల్మూర్: ఈ నెల 29న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ దేవన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని ఆయన తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కవి ఎజ్జు మల్లయ్యకు సన్మానం

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లికి చెందిన యువకవి ఎజ్జు మల్లయ్యను నల్గొండలో నిర్వహించిన పుడమి సాహితీ వేదిక 5వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మోహన్‌రెడ్డి, మానవ హక్కుల పరిరక్షణ చైర్మన్ డాక్టర్ చలమల హైమావతి, పల్లె కిశోర్, కుడిమి సాహితీ వేదిక వ్యవస్థాపకులు బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ఆందోళన



మున్సిపల్ చైర్మన్‌కు వినతిని అందజేస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో అర్హులందరికి వెంటనే డబుల్‌బెడ్రూం ఇళ్లను కేటాయించాలని అర్హులు ఆందోళనకు దిగారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుకోసం అర్హులను గుర్తించింది. ఆరు నెలల కిందట లక్కీడిప్ ద్వారా అర్హులను గుర్తించి వారికి ఇంటి నంబర్లను కేటాయించారు. ఇంటి నంబర్లు కేటాయించారే తప్ప వారికి ఇళ్లకు సంబంధించిన పత్రాలు, తాళాలు ఇవ్వలేదు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన ఇప్పటికి అర్హులకు తాళాలు ఇవ్వకపోవడంతో వారు నిరసన తెలిపారు. బుధవారం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఏఓ మంజులకు, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ సత్యం, కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌లకు వినతపత్రాలు అందజేశారు. అర్హులందరికి డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు.

బిహార్ మాజీ సీఎంకు నివాళి



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఎదుట బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్ శత జయంతిని పురస్కరించుకొని బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రకటించి గౌరవించడం హర్షనీయమన్నారు. వెనకబడిన కులాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడారని దీంతో ఆయనకు జననాయక్‌గా పేరొందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలకపాత్ర పోషించారని వివరించారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సదుర్ల తిర్పతయ్య, ప్రధాన కార్యదర్శి పురుషొత్తం, యం. శివుడు, యస్.బాలస్వామి, శేఖర్, యస్.బాలస్వామి, సత్యనారాయణ, శ్రీశైలం ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: బీహార్ మాజీ ముఖ్యమంత్రి భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్‌కు బుధవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన 100వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించడం హర్షనీయమని ఆ సంఘం అధ్యక్షుడు మదన మురళీ, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్ అధ్యక్షుడు రాజేందర్, ఉపసర్పంచ్ రవీందర్, మాజీ ఉప సర్పంచ్ విజయభాస్కర్, శ్యాం, జంగయ్య, సుభాష్, అశోక్, శేఖర్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు



కొల్లాపూర్: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దని ఏఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్ రికార్డులను వారు పరిశీలించారు. క్రయ, విక్రయాల గూర్చి తెలుసుకున్నారు. ఎరువులు విక్రయించే వ్యాపారులు లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని, విక్రయాలకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా రైతులకు ఇవ్వాలని వారు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ



వెల్దండ: మండలంలోని అజిలాపూర్ పాఠశాలకు సౌండ్ సిస్టంలను కాంగ్రెస్ నాయకులు సిద్దగోని రమేష్‌గౌడ్ బుధవారం వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మమ్మ, జంగయ్య, వెంకటేష్, గణేష్, మొగులయ్య, మల్లేష్, రవికుమార్, పరమేష్ తదితరులు ఉన్నారు.

ఆటో, ట్రాక్టర్ ఢీ: ఒకరికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. తాళ్లపల్లికి చెందిన నిరంజన్ ఆమనగల్లు నుంచి ఆటోలో కల్వకుర్తి వైపు వెళ్తున్నాడు. ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నిరంజన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాధితుడిని 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జొన్నపంట కోతల పరిశీలన



కొల్లాపూర్: మండలంలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో జొన్న కోతలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. బుధవారం పట్టణం సమీపంలో ఏఓనాగరాజు పరిశీలించి, ధాన్యం దిగుబడిని తూకం వేశారు. పంటల దిగుబడి లెక్కింపులో భాగంగా కోతలను పరిశీలిస్తున్నట్లు ఏఓ తెలిపారు. ఆయన వెంట ఏఈఓ శ్రీకాంత్ తదితరులున్నారు.

బాలికల గురుకులాల్లో పురుష సిబ్బందిని తొలగించాలని వినతి



కొల్లాపూర్: మైనార్టీ బాలికల గురుకులాల్లో పురుష సిబ్బందిని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి యూసూఫ్‌లు కోరారు. బుధవారం వారు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి రాజేశ్వరిని కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రేమపేరుతో ఇంటర్ విద్యార్థినిని సెక్యూరిటీగార్డు నిరంజన్ లైంగికంగా వేధిస్తున్నాడని పేర్కొన్నారు. అతనికి సహకరించిన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పాఠశాలలో ఉన్న పురుష సిబ్బందిని తొలగించి, మహిళా సిబ్బందిని నియమించాలని కోరారు.

చెకుముఖి ప్రశ్నాపత్రం ఆవిష్కరణ

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముఖి సంబురాలలో భాగంగా బుధవారం ఈ నెల 27న నిర్వహించే ప్రశ్నాపత్రాన్ని మండల విద్యాధికారి బాసూనాయక్ ఆవిష్కరించారు. 8, 9, 10వ తరగతి చదివే విద్యార్థులు చెకుముఖి టాలెంట్ పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, శ్రీనివాసులు, ధర్మేందర్‌రావు, కన్నాజీ, భాస్కర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల పాత్ర కీలకం



అచ్చంపేటలో ఆర్టీసీ డ్రైవర్లకు పుష్పం అందిస్తున్న విద్యార్థిని

అచ్చంపేట రూరల్: రవాణా వ్యవస్థలో డ్రైవర్ల పాత్ర కీలకమని ఆర్టీసీ డీఎం పి. మురళీదుర్గా ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో డ్రైవర్స్‌డేను విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్ల సేవలను గుర్తించడానికి ప్రతిఏటా సంస్థ డ్రైవర్స్ డేను నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేటు వాహనాల్లో దూర ప్రాంతాలకు ప్రయాణం చేయొద్దని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో ఏడీసీ జంగిరెడ్డి, స్వామి, నాగయ్య, లింగస్వామి, పీటీ కుమార్, కేఎస్ ప్రసాద్, ఎస్ ఎన్ గౌడ్, రత్నమ్మ పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీ సంస్థలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి అన్నారు. బుధవారం పట్టణంలోని డిపో నుండి బస్టాండ్ వరకు డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చటంతో ఎంతో బాధ్యతగా ఉంటారని గుర్తుచేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతా నియామవళిని గురించి వివరించారు. ఆర్టీసీలో 30 ఏళ్లుగా ఒక్క ప్రమాదం చేయని అంజయ్య అనే డ్రైవర్‌ను బస్టాండ్ ఆవరణలో డీఎం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీఐ శ్వేత, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

అచ్చంపేట రూరల్: పట్టణ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఎక్సైజ్ కార్యాలయం పరిసరాల్లో వేలం నిర్వహించనున్నామని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 11 వాహనాలు ఉన్నాయని, ద్విచక్ర వాహనం కోసం రూ. 5వేలు, మిగతా వాహనాల కోసం రూ. 20వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వేలంలో వాహనాలు రానివారికి డబ్బులు తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు.